సాక్షి
వికారాబాద్
సోమవారం । 11 । డిసెంబర్ । 2023



మట్టి పరీక్షలకు మంగళం!

భూసార పరీక్షల కోసం మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన మినీ భూసార కేంద్రాలు రైతులకు ఉపయోగపడడం లేదు. 8లో ▸



'వసతి'పై నిర్లక్ష్యపు నీడ

పుష్కర కాలం క్రితం మొదలైన పెద్దేముల్ ప్రభుత్వ వసతి గృహ నిర్మాణ పనులు నేటికీ పూర్తి కాలేదు. 9లో ▸



ఘనంగా కార్తీక దీపోత్సవం

కార్తీక మాసం ముగింపు సందర్భంగా మండలంలోని వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. 9లో ▸

నిక్షేపంగా తవ్వకాలు!

అనుమతి లేకుండా సుద్ద, ఇనుప ఖనిజం రవాణా

- అటవీ భూములనూ వదలని వైనం
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం
- గ్రామాల ప్రగతికి అవరోధం



పెద్దేముల్ మండలంలో అనుమతి లేకుండా తవ్వకాలు జరిపిన ప్రాంతం

వికారాబాద్: చిన్న తరహా ఖనిజాల పరిధిలోకి వచ్చే సుద్ద, ఇనుప ఖనిజాల అక్రమ తవ్వకాలు, రవాణా జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్నాయి. పగటి వేళ గనుల్లో జేసీబీ, ఇటాచీలను వినియోగించి ముడి సుద్దను, ఎర్రమట్టిని వెలికి తీస్తున్నారు. టిప్పర్లు, లారీల్లో నింపి సమీప వ్యవసాయ పొలాల్లో భారీగా నిల్వ చేస్తున్నారు. పరిశ్రమల నుంచి ఆర్డర్లు రాగానే రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా లారీల్లో పరిమితికి మించి 40టన్నుల నుంచి 50టన్నుల ఖనిజ సంపదను తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి టన్నుకు రూ. 206 చొప్పున రాయల్టీ చెల్లించాలి. అది కూడా లీజు పొందిన గనులకు మాత్రమే. అయితే వెలికితీసిన సుద్దకు చాలా మంది యజమానులు రాయల్టీ చెల్లించకుండా పరిశ్రమలకు తరలిస్తున్నారు. దీంతో గనుల శాఖకు రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో తొమ్మిది రకాల ఖనిజ సంపదకు సంబంధించిన గనులు ఉండగా ఇందులో 226 చిన్న తరహా, నాలుగు పెద్ద తరహా ఖనిజాలకు సంబంధించినవి ఉన్నాయి. అయితే ఇందులో పెద్దల హస్తం ఉండటంతో ఇటీవల మైనింగ్ ఏడీని సైతం మార్చారు. ఇప్పటి వరకు జిల్లాలో విధులు నిర్వహించిన ఏడీని మార్చి గతంలో ఏసీబీకి చిక్కి అనేక ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తిని జిల్లాకు తీసుకురావటం పలు విమర్శలు తావిస్తోంది.

సుద్ద గనులు

కోట్‌పల్లి, పెద్దేముల, మోమిన్‌పేట్, ధారూరు, మారేపల్లి, ఇందోల్, ఒగులాపూర్, రుద్రారం, గోపాల్‌పూర్, తింసాన్‌పల్లి, టేకులపల్లి, జైద్‌పల్లి, మర్పల్లి, కోట్‌మర్పల్లి, వికారాబాద్, తరిగోపుల, రాకంచర్ల, సిద్దులూరు, మాదిరెడ్డిపల్లి, ఎక్‌మామిడి తదితర ప్రాంతాలతో పాటు తాండూరు, బషీరాబాద్, కొడంగల్, దోమ, పూడూరు, వికారాబాద్ మండలాలలో సుద్ద నిల్వలు ఉన్నాయి. పది నుంచి 20 టన్నుల సామర్థ్యం ఉన్న లారీల్లో 40 నుంచి మొదలుకొని 50 టన్నుల వరకు సుద్దను, ఇతర ఖనిజాన్ని తరలిస్తున్నారు. ప్రతి రోజూ డిమాండ్‌ను బట్టి వందల లారీల్లో ఖనిజాన్ని తరలిస్తూ అక్రమార్జనకు తెరతీస్తున్నారు. అధికారులు సైతం వారికే కొమ్ముకాస్తున్నారు. కట్టడి చేయాల్సిన మైనింగ్ శాఖ అధికారులు అమ్యామ్యాలకు ఆశపడి చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏటా సుమారు రూ.100 కోట్ల వరకు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

లీజు ఒకచోట.. రాయల్టీ మరోచోట

లీజు ఒక చోట ఉంటే రాయల్టీ మరో చోట తీసుకొని సుద్ద, ఎర్రమట్టిని తరలిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లీజు తీసుకున్న సర్వే నంబర్ భూమిలోనే తవ్వకాలు చేయాల్సి ఉంది. కానీ కొంత మంది వ్యాపారస్తులు లీజు లేని చోట తవ్వకాలను చేస్తూ సుద్దను అక్రమ రవాణా చేస్తున్నారు. ఎకరం భూమిని లీజుకు తీసుకొని రెండు ఎకరాల నుంచి 5 ఎకరాల వరకు తవ్వకాలు చేస్తున్నారు. ఈ విషయమై మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులకు తెలిసినా వారు పట్టించుకోవడం లేదు. ఇదే అదనుగా భావించిన కొంత మంది మైనింగ్ వ్యాపారులు అక్రమ వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. గతంలో పెద్దేముల్ మండలం మారేపల్లిలో లీజ్ లేకుండా సుద్ద తవ్వకాలు జరిపిన వారిపై నామ మాత్రపు ఫైన్లు వేసి వదిలేశారు. కనీసం గ్రామాల అభివృద్ధి కోసం వచ్చే సెస్ సైతం రావడం లేదు. దీంతో పల్లెల అభివృద్ధి కుంటుపడుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు.

ఫారెస్ట్ భూముల్లోనూ..

వికారాబాద్, తాండూరు సమీపంలోని ఫారెస్టు భూముల్లో కొందరు మైనింగ్ తవ్వకాలు జరిపి రూ. వందల కోట్ల విలువగల ఖనిజ సంపద తరలిస్తున్నారు. దీన్ని గుర్తించిన ఫారెస్టు అధికారులు గతేడాది అడ్డుకున్నారు. వికారాబాద్ సమీపంలోని ఫారెస్టులో రెండు చోట్ల ఇద్దరు బడా మైనింగ్ వ్యాపారులు చాలా కాలంగా తవ్వకాలు జరిపి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారు. ఒక్కో కాంట్రాక్టర్ రూ. 60 కోట్ల చొప్పున ఖనిజ సంపద కొల్లగొట్టారని లెక్కగట్టి రెండు గనులను మూసి వేయించారు. అందులో ఒకరు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. తాండూరు సమీపంలోని ఆత్కూర్ సమీపంలోని ఫారెస్టు భూమిలో తవ్విన క్వారీలో అక్రమంగా రూ. 160 కోట్ల విలువైన ఖనిజాన్ని కొల్లగొట్టారని కోర్టులో కౌంటర్ ఫైల్ దాఖలు చేశారు. కొద్ది రోజుల్లోనే ఆ అధికారిని బదిలీ చేయించి తిరిగి తమ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగిస్తూ రూ. కోట్లు కొల్లగొడుతున్నారు.

న్యూస్‌రీల్

మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు



సీతక్కకు బొకే అందజేస్తున్న జూనియర్ న్యాయవాదులు

అనంతగిరి: ఇటీవల ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసిన పలువురు జూనియర్ న్యాయవాదులు ఆదివారం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ న్యాయవాదులు సంపత్‌రెడ్డి, టీ రాజు, మహ్మద్ అన్సారీ, నరహరి, ప్రభాకర్‌రెడ్డి, అభిలాష్‌రెడ్డి, హరీశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెలగాలి



సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

శంకర్‌పల్లి: ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలని జాతీయ సాహిత్య పరిషత్ ప్రాంత సంఘటన కార్యదర్శి భాస్కర యోగి అన్నారు. మన సంస్కృతి సంప్రదాయలను గౌరవించటంలో భాగంగా ప్రజలు అనేక రూపాల్లో తమ భక్తిభావాన్ని వ్యక్త పరుస్తుంటారని తెలిపారు. మండలకేంద్రంలోని డీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సామాజిక సమరసత ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరయోగి మాట్లాడుతూ.. పంచ భూతాలకు కులం, మతం, బీద, ధనిక వ్యత్యాసం లేదన్నారు. గాలి, నీరు భూమి, ఆకాశం, అగ్ని అందరినీ ఒకేలా చూస్తాయని చెప్పారు. ప్రజలందరినీ ఒకే దగ్గరికి చేర్చే ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విభాగ్ ప్రచారక్ దేవేందర్ రాజు, కార్యవాహ కేరెల్లి అంతరెడ్డి, సామాజిక సమరసత కన్వీనర్ దామోదర్‌రెడ్డి, స్వయం సేవకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఆ జీవోను రద్దుచేసి న్యాయం చేయండి



వీఎంహోం మైదానంలో నిరసన తెలుపుతున్న కానిస్టేబుల్ అభ్యర్థులు

హుడాకాంప్లెక్స్: జీవో 48పై కాంగ్రెస్ ప్రభుత్వం పునరాలోచన చేసి తమకు న్యాయం చేయాలని కానిస్టేబుల్ అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. కొత్తపేటలోని వీఎంహోం మైదానంలో ఆదివారం గతంలో కాంగ్రెస్ నాయకులను కలిసిన ఫొటోలను చూపిస్తూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 48 జీవోతో జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తమకు అన్యాయం జరిగిందనే కాంగ్రెస్ పక్షాన నిలిచామని చెప్పారు. ఎంపిక సమయంలో తమకు అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

మంచిని స్వాగతిస్తాం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రభుత్వం పేద ప్రజలకోసం మంచి చేస్తే స్వాగతిస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10లక్షల ఆరోగ్యశ్రీ పథకాలను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు బస్సుల్లో ప్రయాణం చేసేందుకు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా సహకరించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన పథకాలు ప్రజలకు ఎలా చేరువయ్యాయో అలాగే ఈ పథకాలను ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీమా పెంపు అభినందనీయం

రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

మహేశ్వరం: రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం స్థానిక అధికారులు, వైద్యులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఒకటైన రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల బీమాను ప్రభుత్వం ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఇప్పటి వరకు ఈ పథకం కింద రూ.5 లక్షల బీమా అందుతోందని, కొత్త ప్రభుత్వం దానిని రూ.10 లక్షలకు పెంచిందన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం చేసుకునేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ మేయర్, టీపీసీసీ కార్యదర్శి చిగురింత పారిజాత, కందుకూరు ఆర్డీఓ సూరజ్ కుమార్, తహసీల్దార్ మహమూద్ అలీ, మహేశ్వరం ఇన్‌చార్జి ఎంపీపీ సునితా నాయక్, కందుకూరు ఎంపీపీ మంద జ్యోతి, ఎంపీడీఓ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా పథకాన్ని ప్రారంభిస్తున్న అనితారెడ్డి తదితరులు



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

'ప్రాణహిత – చేవెళ్ల'ను పునఃప్రారంభిస్తాం

- పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తాం
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రద్దు చేసిన ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును పునఃప్రారంభిస్తామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. గోదావరి జలాలను పరిగి ప్రాంతానికి తెచ్చి ఈ ప్రాంత రైతులకు సాగునీరందిస్తామని తెలిపారు. ఆదివారం మండలంలోని అంగడిచిట్టంపల్లి గేటు వద్ద కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. ఎన్కేపల్లి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మన్నేగుడ బస్టాండ్‌లో ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును రీ డిజైన్ పేరిట మాజీ సీఎం కేసీఆర్ కొండ పోచమ్మ రిజర్వాయర్ పేరిట సంగారెడ్డి ప్రాంతానికి తరలించారని తెలిపారు. పరిగి ప్రాంత అభివృద్ధి కోసం మంజూరు చేసిన రూ. 5వేల కోట్లను బీఆర్ఎస్ ప్రభుత్వం వెనక్కు తీసుకుందని తెలిపారు. హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు తరహాలో మన్నేగుడ వరకు రింగ్ రోడ్డును నిర్మిస్తామని తెలిపారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను వికారాబాద్ జిల్లాకు తెస్తామని హామీ ఇచ్చారు. అలాగే వికారాబాద్ నుంచి మక్తల్ వరకు రైల్వే లైన్‌ను పూర్తి చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, సర్పంచ్‌లు జయమ్మ, రాములు, డీసీసీ ఉపాధ్యక్షులు అజీం పటేల్, శ్రీనివాస్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, ప్రధాన కార్యదర్శులు షకీల్, పెంటయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో అంతర్మథనం

- ఎన్నికల్లో ఓటమిపై కారు పార్టీ పోస్టుమార్టం
- అంచనాలు తలకిందులు కావడంపై విశ్లేషణ
- బూత్‌ల వారీగా ఓట్ల లెక్కలు చేస్తున్న నాయకులు



పరిగి: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో బీఆర్ఎస్ నాయకులు అంతర్మథనంలో పడ్డారు. గెలుపు అంచనాలు తలకిందులు కావడానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. ఎన్నికల్లో గెలుపుపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ధీమాతో ఉండగా విజయం కాంగ్రెస్ పార్టీని వరించింది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో హస్తం సత్తా చాటింది. వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూరు నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్యనే పోటీ ఉండగా బీజేపీ ఎక్కడా ప్రభావం చూపలేకపోయింది. అయితే గతం కంటే ఎక్కువ ఓట్లను రాబట్టగలిగిందని చెప్పవచ్చు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ఎన్నికల్లో ఎలాంటి ప్రభావం చూపలేకపోయాయి. ఓటర్లు సైలెంట్‌గా కాంగ్రెస్ పార్టీ వైపే మొగ్గు చూపినట్టు స్పష్టమైంది.

జిల్లాలో గట్టి దెబ్బ

జిల్లాల్లో అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామని అంచనాలు వేసుకున్న బీఆర్ఎస్‌కు గట్టి దెబ్బ తగిలిందని చెప్పవచ్చు. చివరి వరకు తమదే విజయమనుకున్న బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓట్ల లెక్కింపుతో ఊహించని షాక్ తగిలింది. జిల్లాల్లో గత ఎన్నికల్లో ముగ్గురు బీఆర్ఎస్ అభ్యర్థులు గెలువగా కాంగ్రెస్ నుంచి ఒక అభ్యర్థి మాత్రమే గెలిచి బీఆర్ఎస్‌లోకి వెళ్లారు. కొడంగల్‌లో సైతం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ ఓడించినా ఈ సారి కారు పార్టీ ప్రభావం చూపలేకపోయింది. అసలు ఏం జరిగిందని క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించే పనిలో బీఆర్ఎస్ నాయకులు నిమగ్నమయ్యారు. పట్టణం, మండలం, గ్రామాల నాయకులు, క్యాడర్ అంతా కలసి పని చేశారా? లేక కోవర్టులుగా మారారా అన్న సమాచారం తీసుకుంటున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా లెక్కలు తీస్తున్నారు. బీఆర్ఎస్ బలంగా ఉన్న గ్రామాల్లో కాంగ్రెస్ గాలి వీయడానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.

కొంప ముంచిన వెన్నుపోటు

సంక్షేమ పథకాలు అమలు బీఆర్ఎస్ నాయకుల కనుసన్నల్లో జరగడం, లబ్ధిదారుల ఎంపికలో ద్వితీయ శ్రేణి నాయకుల చేతివాటం ప్రదర్శించడంతో పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పవచ్చు. అందరిని సమన్వయం చేసి పథకాలను అర్హులకు అందించాల్సిన నాయకులు గ్రామాల్లో రెండు వర్గాలుగా తయారు కావడం, వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడటం వంటివి పార్టీకి కోలుకోలేని దెబ్బతీసినట్లు తెలుస్తోంది. కాగా బీఆర్ఎస్ కార్యకర్తలుగా కొనసాగుతున్న చాలా మంది పార్టీకి ఓటు వేయలేదని స్పష్టమవుతోంది. ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని పట్టించుకోకపోవడంతో వారు కోపం పెంచుకుని ఓట్ల రూపంలో ప్రతీకారం తీర్చుకున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. అంతే కాకా నియోజకవర్గంలోని ఓ ముఖ్య నాయకుడి నియంత పాలన నియోజకవర్గం మొత్తంపై ప్రభావం పడి ఇంత వరకు వచ్చిందని పార్టీలోని ముఖ్య నాయకులు వాపోతున్నారు. మండలంలోని ఏ చిన్న పనికి ఎమ్మెల్యే దగ్గరకు వస్తే ఆ నాయకుని పేరు చెప్పడంతో, ఆ నాయకుని అనుమతితోనే మండలంలో పర్యటించడం ఏ ఊరికి వెళ్లిన నాయకుడికి చెప్పాలని చెప్పడంతో పార్టీపై, నాయకునిపై తీవ్ర ప్రభావం పడింది. అంతేకాకా అధికార ముసుగులో ఇష్టానుసారంగా భూకబ్జాల ఆరోపణలు బీఆర్ఎస్‌ను కొంప ముంచాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. వీటికి తోటు ఈ సారి ఎన్నికల్లో నియోజవకర్గంలోని దోమ, కుల్కచర్ల మండలాల ఎంపీపీలు, సర్పంచ్‌లు పార్టీలో చేరడం, ఆయ గ్రామాల సర్పంచ్‌లు బీఆర్ఎస్‌ని వదిలి కాంగ్రెస్‌లో చేరడంతో హస్తం పార్టీకి మరింత బలం పెరిగింది. నియోజకవర్గంలో చాలా పోలింగ్ బూత్‌లలో కాంగ్రెస్ పార్టీకే ఎక్కువ ఓట్లు రావడంతో చాలా మంది కార్యకర్తలు సొంత పార్టీకి పని చేయలేరని వాదనలు వినిపిస్తున్నాయి.

ప్రభావం చూపని పథకాలు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రచారం, అభివృద్ధి, సంక్షేమ పథకాలు తమను గట్టెక్కిస్తాయని పార్టీ అభ్యర్థులు భావించారు. ప్రధానంగా నిరంతరం విద్యుత్ సరఫరా, రైతుబంధు, రైతుబీమా, ఆసరా పెన్షన్ పెంపు, దళితబంధు, కల్యాణలక్ష్మి, బీసీ బంధు వంటి పథకాలతో ప్రజలు ఓట్లు వేస్తారని ఆశ పడ్డారు. అయితే ఆ పథకాలు ప్రభావం చూపలేకపోయాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రార్థనలతో.. హోరెత్తిన జాతర



ఏసుక్రీస్తు శిలువ వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు



దైవ సందేశం వినిపిస్తున్న బిషప్ ఎస్ఎల్ కర్‌కరే

- చివరి రోజు ఉత్సవాలకు భారీగా యాత్రికులు
- దైవ సందేశం వినిపించిన దేశ రీజినల్ కాన్ఫరెన్స్ బిషప్‌లు

ధారూరు: ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతర ఆదివారంతో ఘనంగా ముగిసింది. చివరి రోజు ప్రార్థనలకు సుమారు 1.5 లక్షల మంది యాత్రికులు వచ్చారు. ప్రతి ఏటా ఒరిస్సా, జార్ఖండ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చేవారని, ఈ సారి రాలేదని, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు జిల్లాల నుంచి ఏసుక్రీస్తు భక్తులు జాతరకు వచ్చినట్లు ఉత్సవాల కార్యదర్శి దయానంద్, కోశాధికారి స్టీవెన్ తెలిపారు.

ముగింపు ఉత్సవాలకు ఇద్దరు బిషప్‌లు

జాతర ముగింపు ఉత్సవాలకు దేశ రీజినల్ కాన్ఫరెన్స్ బిషప్‌లు ఎస్ఎల్ కర్‌కరే, ఎంఏ ఆద్యానియల్ హాజరయ్యారు. వీరికి జాతర కార్యదర్శి దయానంద్, కోశాధికారి స్టీవెన్ స్వాగతం పలికారు. బిషప్‌లు దైవ సందేశం వినిపించారు. జాతర ప్రాంగణం ప్రార్థనలతో మారుమోగింది. ప్రధాన శిలువ వద్ద ప్రార్థనలు చేసేందుకు యాత్రికులు గంటల కొద్ది వేచి చూశారు. దీంతో చాలా మంది ప్రధాన ముఖద్వారం వద్ద గల శిలువ వద్ద ప్రార్థనలు చేశారు. ఉత్సవాలు ముగియడంతో యాత్రికలు వారివారి గ్రామాలకు వెళ్లిపోయారు. దూర ప్రాంతాలకు వెళ్లే వారికి సరైన రవాణా సదుపాయం లేక ఇబ్బంది పడ్డారు. జాతర ప్రాంతం నుంచి దోర్నాల్ మీదుగా తాండూరు, పరిగి, కొడంగల్, వికారాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే వారు వాహనాలు దొరక్క ఇబ్బందులు పడ్డారు. రవాణా సదుపాయం లేక దాదాపు 10 వేల మంది యాత్రికులు జాతరలోనే ఉండిపోయారు.

మేకలు, గొర్రెలు, కోళ్లకు వేలం

జాతరకు యాత్రికులు సమర్పించిన మేకలు, గొర్రెలు, కోళ్లను విక్రయించారు. భక్తులు హుండీల్లో వేసిన కానుకలను జాతర నిర్వాహకులు వికారాబాద్‌కు తలించారు.

డాగ్ స్క్వాడ్ తనిఖీలు

జాతరలో ఆదివారం డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు డాగ్, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు చేశారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకున్న పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

ముగిసిన రుద్రాభిషేక మహోత్సవం



అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

అనంతగిరి: గత నెల రోజులుగా కొనసాగిన రుద్రాభిషేకం మహోత్సవం ఆదివారం ముగిసింది. ఇందులో భాగంగా పట్టణంలోని రామమందిరంలో ప్రత్యేక పూజలు , అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా ప్రముఖ వ్యాఖ్యాత, కవి భాస్కరయోగి ఆధ్యాత్మిక ప్రవచనం గావించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం స్వామి వారి రథోత్సవం ప్రధాన వీధుల గుండా అంగరంగ వైభవంగా కొనసాగింది. కార్యక్రమంలో ఆధ్యాత్మిక సేవా మండలి ప్రతినిధులు, పుర ప్రముఖులు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హైనా దాడి..

- మృత్యువాత పడుతున్న లేగదూడలు
- ఆందోళన చెందుతున్న రైతులు

షాద్‌నగర్ రూరల్: హైనా దాడిలో లేగదూడలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ శివారులో ఆదివారం తెల్లవారు జామున హైనా దాడిలో మరో లేగదూడ హతమైంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామస్తులు పొలాల వద్ద పశువుల పాకల ఏర్పాటు చేసుకున్నారు. కొన్ని రోజులుగా గుర్తు తెలియని జంతువు దాడిలో లేగదూడలు చనిపోతున్నాయి. దీంతో గ్రామానికి చెందిన రైతులు చిన్న కొమురయ్య, పెద్ద నర్సింహ, ఈర్లపల్లి అంజయ్య, పోచయ్య, దాసరి కృష్ణయ్య పశువుల పాకవద్ద నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారుజామున ఎంపీటీసీ మాజీ సభ్యురాలు స్వప్న పొలంవద్ద చిరుత లేగదూడపై దాడి చేస్తున్న సమయంలో కుక్కలు అరవడంతో రైతులు అప్రమత్తమయ్యారు. వారు గమనించగా చిరుత కుక్కల పైకి గాండ్రిస్తూ వెళ్లిపోయింది. చిరుతను చూసిన రైతులు, గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి చిరుతను పట్టుకోవాలని కోరుతున్నారు. పట్టణ సమీపంలోని వ్యవసాయ పొలాలవద్ద చిరుత సంచరిస్తుందనే వార్త వాట్సాప్‌లలో రావడంతో పట్టణ వాసులు భయాందోళనకు గురయ్యారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

షాబాద్: నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సంకెపల్లిగూడ సర్పంచ్ కుమ్మరి దర్శన్, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో కేసీఆర్ టికెట్ ఇచ్చారని.. ఊపిరున్నంత వరకు ఆయన వెంటే నడుస్తానన్నారు. ఎన్నికల్లో తనపై అభిమానంతో ఓటేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఎన్నికలు సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలన్నీ నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏవైతే సంక్షేమ పథకాలు తెలంగాణ ప్రజలకు అమలు చేసిందో వాటిని తూచా తప్పకుండా కొనసాగిస్తానన్నారు. వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు తదితరులున్నారు.

కార్యకర్తలకు అండగా 'కారు'

మొయినాబాద్: బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మొయినాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఐదు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయన బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్నారు. ఆయనకు మంజూరైన రూ.2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును ఆదివారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి, మైనార్టీ నాయకుడు మహబూబ్, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీకాంత్, ఏఎంసీ వైస్ చైర్మన్ రవూఫ్, నాయకులు పరమేశ్, సురియాదవ్, ప్రవీణ్, ప్రమోద్, రవి పాల్గొన్నారు.

మట్టి పరీక్షలకు మంగళం!

- గ్రామస్థాయిలో కనిపించని మినీ భూసార కేంద్రాలు
- నిరుపయోగంగా భూసార పరీక్షల కిట్లు
- కాలం చెల్లిన కెమికల్

బొంరాస్‌పేట: రైతులు గ్రామస్థాయిలోనే భూసార పరీక్షలు చేసుకొని సారవంతం పెంచుకొని అధిక దిగుబడులు సాధించేందుకు మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన మినీ భూసార కేంద్రాల పనితీరు ప్రశ్నార్థకంగా మారింది. ల్యాబ్‌ల్లో కాకుండా గ్రామస్థాయిలోనే చేసుకునే వెసులుబాటు వ్యవసాయ శాఖ 2018లో అందుబాటులోకి తెచ్చింది. అందుకు 'మినీ భూసార కేంద్రాలు' వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈఓ)బొంరాస్‌పేట, దుద్యాల మండలాల పరిధిల్లోని క్లస్టర్ గ్రామాల్లో ఏర్పాటు చేశారు. మినీ భూసార కేంద్రాల పరికరాలు అందుబాటులో ఉంచినా ప్రస్తుతం కాలం చెల్లిన కెమికల్‌తో కేంద్రాల పనితీరు మూలనపడింది.

మట్టి నమూనాల సేకరణ విధానం

- రైతు తన పొలం పరిధిలో 8 లేదా 9చోట్ల నుంచి మట్టి నమూనాలను తీసుకోవాలి.
- ప్రతిచోట 10సెంటీ మీటర్లు (ఫీటులో మూడో వంతు)లోతు గుంత తీసి అడుగు భాగం నుంచి పైకి 3సెంటీ మీటర్ల వరకు ఉన్న మట్టిని తీసుకోవాలి.
- 8లేదా 9 చోట్ల నుంచి తీసిన మట్టిని కలపాలి. రాళ్లు, చెత్తను ఏరివేయాలి.
- కలిపిన మట్టిని నాల్గు భాగాలు(కుప్పలు)గా చేసి, ఎదురెదురుగా ఉన్న రెండు భాగాలను తీసుకోవాలి. ఈ పద్ధతిని మట్టి మొత్తం అరకిలో వచ్చేవరకు చేయాలి. ఆ మట్టిని మినీ భూసార కేంద్రానికి తీసుకెళ్లాలి.



భూసార పరీక్షల నమూనా (ఫైల్)

పరీక్షల విధానం

- మినీ భూసార కేంద్రాల్లో ఏఈఓలు భూసార పరీక్షలు చేస్తారు. రైతులు తీసుకువచ్చిన మట్టి నమూనాలను మొదట జల్లెడ పడతారు.
- నైట్రోజన్: నైట్రోజన్ శాతాన్ని కనుగునేందుకు 10గ్రాముల మట్టిని తీసుకొని కొన్ని రసాయనాల మిశ్రమంతో పరీక్షలు చేస్తారు.
- పీహెచ్: ఆమ్లాలు, క్షారాలు భూమిలో ఏమేరకు ఉన్నాయో తెలుసుకునేందుకు పీహెచ్ పరీక్షలు చేస్తారు.
- అలాగే పొటాషియం, పాస్పరస్, ఆర్గానిక్స్(సేంద్రీయ కర్బనాలు) ఏమేరకు సదరు రైతు పొలంలో ఉన్నాయో పరీక్షించి చెబుతారు.

ఇది వరకు భూసార పరీక్షల కోసం హైదరాబాద్, జడ్చర్ల తదితర పట్టణాల్లో జరిగేవి. ఫలితాలు సకాలంలో అందేవికావు. గ్రామస్థాయి భూసార పరీక్షలు రైతులకు సౌలభ్యంగా ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అలాగే క్లస్టర్ నుంచి గ్రామస్థాయికి విస్తరించి, స్థానికంగా ఉంటే ఆసక్తి ఉన్న రైతుకు భూసార పరీక్షల శిక్షణ ఇచ్చి అందుబాటులో ఉంచాలని రైతులు అభిప్రాయపడుతున్నారు.



భూసార పరీక్షల పరికరాల కిట్

మినీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

రైతులకు భూసార పరీక్షలు మరింత చేరువ చేసేందుకుగానూ మినీ భూసార కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. కాని ఇప్పటివరకు ఉపయోగించలేదు. నిర్దేశించిన పద్ధతుల్లో మట్టినమూనాలను సేకరించలేదు. పరీక్షల్లో తేలిన ఫలితాల ప్రకారం భూములను సారవంతం చేసుకుందామంటే వాటి అడ్రస్సే లేదు.

క్లస్టర్ గ్రామాల్లోనే భూసార పరీక్షలు

భూసార పరీక్షల కోసం ఐదేళ్ల క్రితం మండల పరిధిలోని నాలుగు గ్రామాల్లో మినీ భూసార పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదట్లో రైతులు కొంత ఆసక్తి చూపకపోవడం, పరీక్షలు చేసే కెమికల్ ప్రస్తుతం కాలం చెల్లింది. కొత్తగా కెమికల్ సరఫరా కాలేదు. కెమిల్ సరఫరా చేస్తే ఏప్రిల్‌లో పరీక్షలు చేస్తామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

శుభాకాంక్షల వెల్లువ

అసెంబ్లీ స్పీకర్‌గా ఎంపికైన వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌కు బంట్వారం ఎంపీపీ ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు సీఎం నర్సింలు ,జినుగుర్తి శ్రీనివాస్ ,యూత్ కాంగ్రెస్ నాయకుడు సంజీవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం వికారాబాద్‌లో వేర్వేరుగా కలిసి ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని వారు ఆకాంక్షించారు.

– బంట్వారం



ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ ప్రభాకర్



ప్రసాద్‌కుమార్‌కు బొకే అందజేస్తున్న నర్సింలు



ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జినుగుర్తి శ్రీనివాస్

సీఎం పదవి అదృష్టం



డెవలప్‌మెంట్ కాన్‌స్టెన్సీ ఫోరం స్టిక్కర్‌ను విడుదల చేస్తున్న సభ్యులు

- కొడంగల్ నియోజకవర్గం డెవలప్‌మెంట్ ఫోరం సభ్యులు
- తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆకాంక్ష

కొడంగల్ రూరల్ : అత్యంత వెనకబడిన కొడంగల్ నియోజకవర్గానికి ముఖ్యమంత్రి పదవి వరించడం కొడంగల్ ప్రజల అదృష్టమని కొడంగల్ కాన్‌స్టెన్సీ డెవలప్‌మెంట్ ఫోరం కమిటీ సభ్యులు అన్నారు. ఆదివారం పట్టణశివారులోని శ్రీరాఘవేంద్ర ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలోని 8మండలాలకు చెందిన అన్ని పార్టీల నాయకులతో కలిసి కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్య్రం వచ్చాక మొదటిసారి కొడంగల్‌కు సీఎం పదవి వచ్చింది. కావున, అన్ని పార్టీల నాయకులు అభివృద్ధిపై కలిసికట్టుగా సహకరించాలన్నారు. రాష్ట్రంలోని గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేట నియోజకవర్గాల మాదిరిగా కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోనేందుకు పార్టీలకతీతంగా సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేద్దామని అన్నారు. విద్యా, ఉద్యోగాలు, సాగు, తాగునీరు.దీర్ఘకాలిక సమస్యలతోపాటు, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేవిధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్దామని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు భీమయ్య, బస్వరాజ్, డాక్టర్ రవీంద్రయాదవ్, మురళీనామాజీ, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా నా కుటుంబ సభ్యులే

- తాండూరు వాసులకు రుణపడి ఉంటా
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి
- విజయోత్సవ ర్యాలీకి భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు

తాండూరు: నన్ను ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపించిన ప్రజలకు రుణపడి ఉంటానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. పట్టణంలోని ఇందిరాచౌక్ నుంచి వేలాది మంది పార్టీ శ్రేణులతో ప్రారంభమైన ర్యాలీ గంజ్, మర్రిచెట్టు కూడలి, గాంధీచౌక్, భావిగి భద్రేశ్వర దేవాలయం, రైల్వేస్టేషన్ కూడలి నుంచి శాంత్‌మహల్ సర్కిల్ నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు కొనసాగింది. ప్రతి కూడలిలోనూ పార్టీ నాయకులు గజమాలలు వేసి ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాండూరులో ఈ రోజు నుంచి అధికార పక్షం– ప్రతిపక్షం అనేది లేకుండా మనందరం సోదరభావంతో ఉండాలన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు.. ఎన్నికలు పూర్తయ్యాక సమష్టి తత్వంతో తాండూరు అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజలు విశ్వసించి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని తెలిపారు. అధికారం వచ్చిన రెండు రోజుల్లోనే రెండు గ్యారంటీ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. తాండూరు ప్రాంతం రానున్న రోజుల్లో వేగంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. తాండూరులో ఇక నుంచి ఎలాంటి అక్రమ కేసులు, భూకబ్జాలు, బెదిరింపులు, వ్యాపారస్తుల దుకాణాలపై దాడులు చేయడం లాంటివి ఉండవన్నారు.నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవ చేస్తానన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునితసంపత్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ జాదవ్, మున్సిపల్ కౌన్సిలర్‌లు రత్నమాల బాల్‌రెడ్డి, నీరజాబాల్‌రెడ్డి, మమతనాగరాజ్, మధుబాల,మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, అబ్దుల్ రవూఫ్, మసుద్, హబీబ్‌లాల, ప్రభాకర్‌గౌడ్, సంతోష్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



విజయోత్సవ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు

అన్ని వాగ్దానాలను నెరవేరుస్తాం

ఎమ్మెల్యే ప్రసాద్‌కుమార్

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన అన్ని వాగ్దానాలను నెరవేరుస్తామని వికారాబాద్ ఎమ్మెల్యే జి.ప్రసాద్‌కుమార్ అన్నారు. మహాలక్ష్మి పథకం కింద ఆదివారం వికారాబాద్ బస్టాండ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య సహాయం రూ.10లక్షలకు పెంచుతున్న పథకాన్ని ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలను 3 నెలల్లోపు అమలు చేస్తామన్నారు. వికారాబాద్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంక్షేమం, అభివృద్ధితో కూడిన పాలన అందిస్తామని వివరించారు. వికారాబాద్ ప్రజలు ఆశీర్వదించి అధిక మెజార్టీతో గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. మహిళలు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పలువురు నాయకులు కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అడిషల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్‌డీఓ విజయకుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్‌కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్, ఆర్‌ఎంఓ శ్రీధర్, డీఎం భక్షినాయక్, ఎంపీపీ చంద్రకళ, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ రమేష్‌కుమార్, మండల కోఆప్షన్ సభ్యుడు జాఫర్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసాద్‌కుమార్

ప్రజలకు అందుబాటులో ఉంటా

విజయోత్సవ ర్యాలీలో రామ్మోహన్‌రెడ్డి

పరిగి: నన్ను భారీ మెజార్టీతో గెలిపించిన పరిగి నియోజకవర్గం ప్రజలకు నిరంతరం అందుబాటు ఉండి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కాంగ్రెస్ కార్యకర్తల ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యేకు కార్యకర్తలు భారీ ఎత్తున స్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి వస్తున్న ఆయనకు కార్యకర్తలు పూల బొకేలతో స్వాగతం పలికి, కార్లు, బైక్‌లతో ర్యాలీగా పట్టణానికి చేరుకున్నారు. కౌన్సిలర్ అనసూయ ఎమ్మెల్యేకు హారతి ఇచ్చి స్వాగతం పలికింది. అనంతరం పట్టణంలో విధుల్లో ర్యాలీగా తిరుగుతూ కార్యకర్తలకు అభివాదం చేస్తూ విజయోత్సవ సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. అధిక నిధులు తీసుకువచ్చి పరిగి రూపురేఖలు మారుస్తానని భరోసా కల్పించారు. ఆరు గ్యారంటీలను ప్రజలకు అందేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో ఆయా మండల అధ్యక్షులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న కౌన్సిలర్ అనసూయ



పరిగిలో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: సమాజంలోని ప్రతి ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో నందిగామకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జిలెల్ల రాంరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. అంతకు ముందు అంతిరెడ్డిగూడలోని హనుమాన్, ఎల్లమ్మ ఆలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్, ఎంపీటీసీ సభ్యులు కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, సుదర్శన్ గౌడ్, వేణుగోపాల్ గౌడ్, సత్తయ్య, ప్రభాకర్, నిరంజన్‌గౌడ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అభినందనల వెల్లువ

కొత్తూరు: నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన వీర్లపల్లి శంకర్ ఆదివారం కొత్తూరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన్ను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మద్దతు ప్రకటించి తన గెలుపునకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలు, నాయకుల సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులు సుదర్శన్‌గౌడ్, వేణుగోపాల్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, నర్సింహ, రమేశ్, సత్తయ్య, ప్రభాకర్, సురేశ్‌గౌడ్, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, స్వాములు

నిధుల కోసం పోరాడుతాం

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: ప్రతిపక్షమైనా నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తెచ్చేందుకు పోరాడుతామని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ఆదివారం ఆమెను మండల పరిధిలోని గొల్లూరు గ్రామానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు గ్రామ సమస్యలను వివరించారు. ఇందుకు స్పందించిన సబితారెడ్డి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ లీగల్ సెల్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌చారి, పార్టీ గొల్లూరు గ్రామ అధ్యక్షుడు ఆనంద్, పార్టీ సీనియర్ నాయకులు దర్శన్, మాదయ్య, హరిశంకర్, భిక్షపతి, పోషయ్య, నర్సింహ, శ్రీశైలం, విజయ్, శివ కుమార్, వినయ్, సుజన్ కుమార్, శ్రీకాంత్, సత్తయ్య, యాదయ్య, మురళీకృష్ణ గౌడ్, చిన్న యాదయ్య, సంజీవ కుమార్, యాదయ్య, పాల్యా టోప్యా నాయక్, మహేశ్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంతో సమస్యల పరిష్కారం

రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసీఫ్అలీ

కద్లాల్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎనుముల రేవంత్‌రెడ్డిని రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసీఫ్అలీ మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆసీఫ్అలీ మాట్లాడుతూ.. జెడ్పీటీసీ సభ్యుడిగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా ప్రతిపక్షంలో ఉంటూ నిరంతరం ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాడిన వ్యక్తికే రాష్ట్ర ప్రజలు పట్టం కట్టారన్నారు. పార్టీ నాయకులతో కలుపుగోలుగా ఉంటూ కాంగ్రెస్‌ను అధికారంలోని తీసుకువచ్చిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రజాప్రభుత్వంతో రాష్ట్ర ప్రజల సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్నారు.



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆసీఫ్అలీ